ప్రజాశక్తి

శనివారం 26 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

టిడ్కో ఇళ్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియల్లో ..

అవకతవకలపై విచారణ

◆ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు ◆ త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, ప్రాజెక్టులు

◆ డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మంజూరు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అవకతవకలపై ప్రత్యేక కమిటీతో విచారణ జరుపుతామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. విశాఖపట్నం జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి (డిఆర్‌సి) సమావేశంలో మంత్రి వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టులు, జిల్లా స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్ రోడ్లపై, ఇతర ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివిధ అంశాలపై మాట్లాడారు. దేశంలో ప్రముఖమైన నగరాల్లో ఒకటైన విశాఖపట్నాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని, ఆర్థిక రాజధాని ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని, సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. పేదలందరికీ ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఆక్రమణల క్రమబద్ధీకరణ నిమిత్తం జీవో 30ని తీసుకొచ్చిందని, దీని ఆవశ్యకతను, ప్రయోజనాలను ప్రజలకు మరింత వివరించాల్సి ఉందని అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అదనపు తాగునీటి ట్యాంకులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శానిటేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చి చర్యలు చేపట్టాలని సూచించారు. విఎంఆర్‌డిఎ పరిధిలో చేపట్టే మాస్టర్ ప్లాన్ రోడ్లను, ఇతర ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని నిర్దేశించారు. మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సదరం స్లాట్‌ల విషయంలో వెసులుబాటు కల్పించాలని, ప్రజలకు సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో స్లాట్ ఇవ్వాలని మిగతా 2లో..

విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న ఎయు భవనాలు

ఎయు శతాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

◆ నేటి నుంచి కార్యక్రమాలు ప్రారంభం

◆ ఏడాది పొడవునా నిర్వహణకు ప్రణాళిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవ శోభను సంతరించుకుంది. శనివారం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇవి ఏడాది కాలం కొనసాగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనిపై శుక్రవారం ఉదయం పాలకమండలి సమావేశ మందిరంలో కోర్ కమిటీ సభ్యులతో వర్సిటీ ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎయు శతాబ్ది సంవత్సరం శనివారం ప్రారంభమై ఏడాది కాలం పాటు సాగనుందన్నారు. ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంవత్సరం పొడుగునా అకడమిక్, ఔట్రీచ్, మెగా ఈవెంట్లు జరుగుతాయన్నారు. అదే విధంగా 2026 ఏప్రిల్ 26న శతాబ్ది సంవత్సర ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే మెగా ఈవెంట్లను విభిన్న విభాగాలు సంయుక్తంగా, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వ్యక్తులను ఆహ్వానించాలన్నారు. సాధారణ సదస్సులకు భిన్నంగా ఈ మెగా ఈవెంట్‌లు ఉండాలని దిశా నిర్దేశం మిగతా 2లో..

8 మంది క్రికెట్ బుకీల అరెస్ట్

▶ వార్త 2లో..

గిరిజన విలువిద్య పోటీలు ప్రారంభం

▶ వార్త 3లో..

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

▶ వార్త 4లో..

నేడు విశాఖకు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : శనివారం విశాఖ జిల్లాకు సిఎం చంద్రబాబు రానున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. శ్రీకాకుళంలో జరిగే మత్స్యకార సేవ పథక నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి నేరుగా సాయంత్రం 5:45 గంటలకు బీచ్ రోడ్డులో ఉన్న కోస్టల్ బ్యాటరీకి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. అక్కడ నుంచి 5:50 గంటలకు బయలుదేరి 5:55 గంటలకు ఆంధ్రా మెడికల్ కాలేజీకి వెళ్లి ఆంధ్రా మెడికల్ కాలేజీ అలుమ్ని ఆధ్వర్యంలో నిర్మించిన సెంటినరీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 6:55కి అక్కడి నుండి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా 7:15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 7:25 గంటలకు వాయుమార్గం ద్వారా అమరావతి వెళ్తారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సంబంధిత ఏర్పాట్లను సిపితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

చంద్రమౌళికి సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతిచెందిన చంద్రమౌళి భౌతికకాయానికి పాండురంగాపురంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జివిఎంసిలో పార్టీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్ర నిఘా వ్యవస్థ డొల్లతనం మరోసారి బయటపడిందన్నారు.

ఉగ్రవాదాన్ని అణిచివేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ఈ చర్యలకు పాల్పడిన వారిని శిక్షించాలని, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పి ప్రజలు, పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

అవకతవకలపై విచారణ

సూచించారు. మేఘాద్రి గెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణపై సమీక్షించిన ఆయన ప్రభుత్వ నిర్దేశాల మేరకు తుది చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నగరంలో పలు చోట్ల వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా వెనువెంటనే ఆడిట్ చేయించి ఎక్కడెక్కడ అవసరమో అక్కడ వీధి దీపాలు యుద్ధప్రాతిపదికన వేయించాలని అధికారులను ఆదేశించారు.

టిడ్కోపై కమిటీ

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మంజూరు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పలు అవకతవకలు జరిగాయని, జాబితాలు తారుమారయ్యాయని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా దీనిపై ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి డోలా సూచించారు. జివిఎంసి ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

సమస్యలను నివేదించిన ప్రజాప్రతినిధులు

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, కాలయాపన చేయరాదని పేర్కొన్నారు. నగరంలో ఆయా ప్రాంతాల్లోని అవసరాలకు సరిపడా సామర్థ్యం కలిగిన వీధి దీపాలు వేయాలని అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో కొంతకాలంగా వీధి లైట్లు వెలగడం లేదని ప్రస్తావించారు. గాజువాక ప్రాంతంలో జీవో.45 అమల్లో మరింత వెసులుబాటు కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 30లో నిర్దేశించిన గడువును 2019 నుంచి 2024 వరకు పెంచాల్సి ఉందని, అప్పుడే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. పట్టాతో పాటే కన్వేయన్స్ డీడ్ కూడా ఇవ్వాలని కోరారు. అబ్జెక్సనబుల్ ఆక్రమణల క్రమబద్ధీకరణపై కూడా తుది నిర్ణయం తీసుకోవాలని, దీనిపై ప్రభుత్వానికి నివేదించాలని విజ్ఞప్తి చేశారు. గాజువాకలో విలేజ్ రెవెన్యూ మ్యాప్‌ను సవరించాలని, పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన చర్యలు చేపట్టాలని సూచించారు. గంగవరం పోర్టులో ఆర్అండ్ఆర్ కింద ఉద్యోగ నియామకాలు, భూ పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై మాట్లాడారు.

వేపగుంట – పినగాడి రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని, ఎనిమిది నెలలుగా కాలయాపన జరుగుతోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఒక సెంటు స్థలాలు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఇతర అంశాలపై ప్రస్తావన తీసుకొచ్చారు.

బొత్స అభ్యంతరం

గతంలో ప్రకటించిన లబ్ధిదారుల జాబితా లేదని సంబంధిత అధికారులు చెప్పడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సమావేశంలో స్పందించారు. అధికారులు అలా ఎలా చెబుతారని, జాబితా లేకపోవటమేంటని, అనర్హులకు రిజిస్ట్రేషన్లు జరగడమేంటని ప్రశ్నించారు. అలా జరిగితే విచారణ జరిపించాలని పేర్కొన్నారు.

100 గజాలలోపు స్థలం కలిగిన వారు చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు అధికారులు అడ్డంకులు కలిగిస్తున్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎపి సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ ప్రస్తావించారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సులను అధికారులు పట్టించుకోవాలని ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు.

జివిఎంసి పరిధిలో జోన్ల పునర్వవస్థీకరణపై కలెక్టర్ వివరణ

పరిపాలనపరమైన సౌలభ్యం కోసం జివిఎంసి పరిధిలోని జోన్లను పునర్వవస్థీకరణ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మంత్రికి, జిల్లా ప్రజా ప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం ఉన్న జోన్లను ఆయా నియోజకవర్గాల ఏరియాకు అనుగుణంగా మారుస్తామని చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక జోన్ వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించారు.

సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎయు శతాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

చేశారు. ఈ సందర్భంగా సభ్యుల నుంచి కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలను స్వీకరించారు. ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 6 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న వాక్‌థాన్‌ను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. అనంతరం సిరిపురం వద్దనున్న సిఆర్ రెడ్డి సర్కిల్, స్నాతకోత్సవ మందిరం, ఎయు పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటిస్తారన్నారు. అనంతరం శతాబ్ది ఉత్సవాలను ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన బెలూన్‌ను నగర పోలీస్ కమిషనర్ ఎగురవేస్తారన్నారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి ప్రధాన వేడుకలు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరుగుతాయన్నారు. ముందుగా 30 నిమిషాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎయు విజన్ డాక్యుమెంట్, లోగా ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకం ప్రదర్శన ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఎయు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను ఉపకులపతి స్వయంగా అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.

పిఎం మాతృవందన యోజనపై శిక్షణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: మహిళా అభివద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా, ప్రధానమంత్రి మాతృవందన యోజనపై శిక్షణ కార్యక్రమం జోన్-4 జివిఎంసి కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖపట్నం, విజయ నగరం జిల్లాలకు చెందిన మహిళ, శిశు సంక్షేమశాఖలో విధులు నిర్వహిస్తు న్న సిడిపిఓలు పాల్గొన్నారు.

8 మంది క్రికెట్ బుకీల అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో అమాయక యువతను లక్ష్యంగా చేసుకొని బెట్టింగులకు పాల్పడుతున్న ఎనిమిది మంది బుకీలను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను విశాఖ కమిషనరేట్ అధికారులు శుక్రవారం తెలియజేశారు. నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు యువతను లక్ష్యంగా చేసుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి వాళ్ల దగ్గర ఉన్న డబ్బు అంతా ఖాళీ చేసి బెట్టింగ్ వెబ్‌సైట్‌లో పెట్టేలా అలవాటు చేస్తున్నారని సమాచారం అందడంతో సిటీ టాస్క్ ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా విశాలాక్షినగర్ వద్ద ఉన్న జోడిగుడ్లపాలెం ప్రాంతంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న పెదవాల్తేర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఈ నెల 20న అరెస్టు చేశారు. విచారణలో భాగంగా మరో నలుగురు వ్యక్తులతో కూడిన ఒక ముఠా మధురవాడలో ఉన్న ఒక అపార్టుమెంట్‌లోని ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి లభించిన సమాచారం ద్వారా ఈ నెల 23న మధురవాడ, శివాజీ పాలెం, చినగదిలి ప్రాంతాలకు చెందిన మరో ముగ్గురు బుకీలను అరెస్టు చేశారు. అందులో ఒక వ్యక్తి ఆంధ్ర యూనివర్సిటీలో గ్రేడ్ – 2 డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మిగిలిన వారు నగరంలో పలు ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్నారు.

వారి నుంచి నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, రెండు బేసిక్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన ముద్దాయితో పాటు బెట్టింగ్ ఆడుతున్న జూదగాళ్లను ఇంకా అరెస్టు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణం పేరిట మోసగించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఇళు కట్టి ఇస్తామని చెప్పి పలువురి నుంచి లక్షల రూపాయలు చొప్పున వసూలు చేసి మోసగించిన రామ్ నగర్‌లోని డాక్ యార్డ్ ఉద్యోగి పాల అప్పలరాజును తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐద్వా జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, జగదాంబ జోన్ కమిటీ అధ్యక్షురాలు కె.మణి మాట్లాడారు. రామ్ నగర్ ఆదిత్య కాలేజీకి ఎదురుగా నివసిస్తున్న డాక్ యార్డ్ ఉద్యోగి పాల అప్పలరాజు అదే ప్రాంతంలోని ఒక బిల్డర్‌తో సంబంధాలు ఉన్నాయని, అతనితో మాట్లాడి పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని స్థానిక మహిళలతో చెప్పి నమ్మబలికాడన్నారు. ఈ క్రమంలో వసూలు చేసిన సొమ్ము రూ.కోటిన్నర వరకు ఉంటుందన్నారు. డబ్బు వసూలు చేసి సంవత్సరం దాటడంతో ఇళ్లు నిర్మించాలని పేదలు ఆయనను డిమాండ్ చేశారన్నారు. అయితే వారికి సరైన సమాధానం చెప్పలేదు సరి కదా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పేదలు మోసపోయినట్టు గుర్తించారన్నారు. తదుపరి త్రీ టౌన్ స్టేషన్‌లో గత ఏడాది డిసెంబర్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అప్పలరాజును అరెస్ట్ చేయాలని, ఇళ్ల పేరుతో మోసగించిన అతని నుంచి రూ.కోటిన్నర వసూలు చేసి బాధితులకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, ఐద్వా నాయకులు రామలక్ష్మి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మె జయప్రదం కోసం 27న సదస్సు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20న దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మె నేపథ్యంలో దాని జయప్రదం కోసం ఆదివారం ఉదయం 9:30 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక సదస్సు జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎస్.జ్యోతీశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రాంతాలు, పరిశ్రమలు, రంగాలు, యూనియన్ల నుండి కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారని తెలిపారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకు జరిగే ప్రమాదాన్ని ఈ సదస్సులో వివరిస్తామన్నారు. ఈ సదస్సుకు అఖిలపక్ష కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

కెఎస్.చలంకు విసికె అంబేద్కర్ అవార్డు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: తమిళనాడు విసికె డాక్టర్ అంబేద్కర్ అవార్డు ఆచార్య కె.ఎస్.చలంనకు ప్రకటించారు. ప్రతి సంవత్సరం డాక్టర్ అంబేద్కర్,పెరియార్ పేరు మీదుగా ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డులను ఈ ఏడాది ఆచార్య కె.ఎస్.చలం, దేవనూర్ మహాదేవలకు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆచార్య చలం, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి జాతీయ స్థాయి రాజ్యాంగ పదవి పొందిన మొదటి ఆచార్యులు (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా) అధ్యాపకులుగా ఏయూ నుంచి మొట్టమొదటి సారిగా ఉన్నత పదవి పొందారు. తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు వెంకయ్యనాయుడు, జస్టిస్ చలమేశ్వర్ రాజ్యాంగ పదవులు అలంకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతజయంతి జరుపుకుంటున్న సందర్భంగా ఈ అవార్డ్ రావటం విశ్వవిద్యాలయానికి, విశాఖ నగరానికి గౌరవంగా భావించవచ్చు. గతంలో విసికె అంబేద్కర్ అవార్డును తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ప్రధానం చేశారు. ఆచార్య చలం రాసిన పుస్తకాలు మూడు తమిళంలోకి చింతన్ బుక్స్ చెన్నైవారు అనువాదం చెయ్యగా బహుళ ప్రాచుర్యం పొందాయి. నాల్గవ పుస్తకం ఇంగ్లీష్‌లో వచ్చిన హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇన్ సౌత్ ఇండియా ద్రవిడియన్ మార్వెల్ అన్నది ఇప్పుడు తమిళంలోకి అనువాదం అవుతోంది.

ఆచార్య చలం ఇంగ్లీష్‌లో 28, తెలుగులో 14 పుస్తకాలు ప్రచురించారు.ఆయన రచనలలో బహుజనవాదం, మార్క్స్ అంబేద్కర్ పులే వాదనలే కాకుండా దేశంలో మొట్టమొదటి సారి మానవ అభివద్ధిపై పరిశోధన చేసిన ప్రముఖులు,ఆర్థిక శాస్త్ర ఆచార్యులుగా, ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ప్రసిద్ధులు. ఉత్తరాంధ్ర ఉద్యమ నిర్మాతగా తెలుగు వారికి చిరపరిచితులు. సాధారణంగా అవార్డులకు దూరంగా వుండే చలంతో, విసికె పార్టీ కార్యదర్శి ,ఎంపి రవికుమార్ మాట్లాడి, ఇది చాలా గౌరవ ప్రదమైన అవార్డు అని, రాజకీయాలకు అతీతంగా దేశ గౌరవాన్ని పెంచే పెద్దలకే ఇస్తున్నామని, అంగీకరించాలని ఒప్పించారు. శుక్రవారం చైన్నైలో ఈ అవార్డును ప్రకటించారు.

టౌన్ ప్లానింగ్‌కు 11 వినతులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి 11 వినతులు వచ్చాయని జీవీఎంసీ సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో సిపిలు, డీసీపీలు, ఏసీపీలతో ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడారు.

మహా విశాఖ నగరపాలక సంస్థ

రేఖానెం.399608/Z-1 రహదారి అభివృద్ధి ప్రణాళికపై పౌరుల అభ్యంతరాలు సూచనలు కోరుట గూర్చి తేది: 20-04-2025

మహావిశాఖనగరపాలక సంస్థ, విశాఖపట్నం వారు ఎన్.హెచ్-16 తగరపువలస జంక్షన్ భీమునిపట్నం పోలీస్‌స్టేషన్ వరకు ప్రధాన రహదారికి అనుసంధానించే 80'-0' అడుగుల వెడల్పు గల రహదారి అభివృద్ధి ప్రణాళికను ఆమోదించియున్నారు. ప్రతిపాదిత రహదారి 80'-0' రోడ్డులో ఎన్.హెచ్-16 తగరపువలస జంక్షన్ నుండి భీమునిపట్నం పోలీస్‌స్టేషన్ వరకు సర్వేనెంబర్లు, 5,6,7,9,10,26,36,37,38,39,40,41 తగరపువలస గ్రామం, సర్వేనెంబర్లు 36,32,33, 37,53,31,52,54,30,25,55,50,56,57,58,59,23,64,65,66,68,67,82,83 చిట్టివలస గ్రామం సర్వేనెంబర్లు 3,13,14,15,12,11,7,17,10,18,19,16,38, మూలకుద్దు గ్రామం సర్వేనెంబర్లు 13,14,5,16,22,21,23,24,32,33,51,52,30, 31 కుమ్మరిపాలెం వలంద భూములు (కె.వి.భూముల గ్రామం మరియు బ్లాక్ నెం. 1,3,4,5 టి.ఎస్.నెంబర్ 1,3,4,5,6,156,157,117,147, 134,148,150,155,154,153,205,209,208, 212, 210, 213, 214, 215, 233, 204, 199, 165, 164 భీమునిపట్నం టౌన్, భీమునిపట్నం మండలం, విశాఖపట్నం ఆమోదింపబడిన మాస్టర్ ప్లాన్ 2041 నందు సదరు రోడ్డు 80'-0' జి.ఓ.ఎం.ఎస్.నెం. 136, తేది: 08-11-2021 నందు ప్రతిపాదించి యున్నారు. అందువలన ప్రజలు తమ అభ్యంతరాలు సూచనలు / జి.వి.యం.సి. ఆఫీస్ భీమునిపట్నం నందు సమర్పించి సమాచారము అందజేయవలసినదిగా కోరాడమైనది. దీనికి సంబంధించి, ఎన్.హెచ్.-16 తగరపువలస జంక్షన్ నుండి భీమునిపట్నం పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డు 5.9 కి.మీ. పొడవుతో 80'-0' అడుగుల వెడల్పు గల మాస్టర్ ప్రధాన రహదారికి సంబంధించిన ఆర్.డి.పి.పై ఆమోదానికి సంబంధించి జివియంసి ద్వారా ఈ నోటిఫికేషన్ వెలువడిన తేది నుండి 15 దినముల లోపు సూచనలు మరియు అభ్యంతరములు మొదలగునవి లేనట్లయితే రహదారి అభివృద్ధి ప్రణాళిక ఆర్.డి.పి. యొక్క ఆమోదము నిబంధనల ప్రకారము తదుపరి చర్యలు చేపట్టబడును.

సం/- కమీషనర్, జి.వి.యం.సి.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: KOTHAVALASA
O.S.90/2024

Between:
1) Smt. Randhi Varalakshmi
2) Dr. Randhi Kalyan Chakravarthy (Rep. by his mother and GPA Holder Smt. R. Varalakshmi i.e. the 1st Plaintiff above) ...Plaintiffs

And:
1) Smt. Beela Madhuri
2) Smt. Gadela Shanti Swapna ...Defendants

Summons to the 1st Defendant

To,
D-1: Smt. Beela Madhuri,
W/o. Beela Ramayya, Hindu,
aged about 45 years,
R/at C/o. Kundrapu Muthayala Rao,
D.No.45-38-15,Revenue Ward 31,
Jagannadhapuram, Akkayyapalem,
Visakhapatnam-530016.

Take notice that the above plaintiffs filed the above suit for cancellation of a registered Settlement Deed, Document No.790 of 2000 dated 04-05-2000 against the above defendants and the said suit stands posted to **15-05-2025** for appearance of 1st defendant above. Therefore, take notice that you, the 1st defendant in above suit, are hereby directed to appear before the above Hon'ble Court on **15-05-2025** at **10:30 A.M.,** either in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings; and also take notice that in default of your appearance on the aforesaid day the above suit will be heard and determined in your absence.

(Hearing date: 15-05-2025)

V.Someswara Rao, Ravindranath Sahu
V. Sreerama Murthy & D. Siva Prasad
Advocates for Plaintiffs, Visakhapatnam.
Cell: 94411 40375 and 98498 13116.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJUWAKA
O.S. 210/2023

Between:
CANARA BANK
Green City Branch, Gajuwaka,
Visakhapatnam. . . . Plaintiff

And:
1) M/s. Venkateswara Water Plant
Rep., by its Prop. Sri Dubasi Tejesh
2) Debasi Tejesh, S/oDubasi Appa Rao.
. . . Defendants

To
1) M/s. Venkateswara Water Plant,
Rep., by its Prop., Sri Dubasi Tejesh,
D.No.2-4-5, Shop. No.1, NH-5,
Rajupalem Village, Anakapalle-531001,
2) Sri Dubasi Tejesh,
S/o Dubasi Appa Rao, D.No.36-18-1,
Kanta Reddy Kancharapalem,
Visakhapatnam-530008,.

NOTICE

Take notice that, the above named Plaintiff instituted the above suit against you under Order VII Rule (1) read with section 26 of Civil Procedure Code for Suit claim. You are hereby summoned to appear in the above Court in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above suit on the day **16-05-2025 at 10.30 A M.** Take notice that in default of your appearance on that day and hour, the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

GV S PURUSHOTHAMARAO
ADVOCATE,
FLAT NO. 203,
GANNI RESIDENCY ABIDNAGAR,
VISAKHAPATNAM-16

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న ఉద్యోగార్థులకు వర్తమానాంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భూగోళశాస్త్రం తదితర విషయాలపై క్విజ్‌పోటీలు నిర్వహించారు. పౌరగ్రంథాలయానికి వచ్చిన 60 మందిని ఏడు బృందాలుగా విభజించి, గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డివి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధాన గ్రంథ పాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.

దేవుడుబాబుకు పలువురి నివాళి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు రాజాసాగి సన్యాసిరాజు (దేముడుబాబు) అంత్యక్రియల్లో శుక్రవారం పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ మంత్రులు అప్పల నరసింహరాజు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొత్స చిన్నశ్రీను, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నేతలు పాల్గొని దేముడుబాబు భౌతికకాయానికి నివాళులర్పించారు. అజాతశత్రువుగా దేముడుబాబు సేవలను కొనియాడారు.

ప్రిఫరెన్షియల్ సర్టిఫికెట్లకు 29 మంది రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - సీతమ్మధార: విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల జారీకి అనకాపల్లి జిల్లా నుంచి 29మంది ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్, కంటి పరీక్షలు జరుగుతున్న ప్రక్రియను చినగదిలి, భీమిలి, పద్మనాభం, గోపాలపట్నం ఎంఇఒలు అనురాధ, శివరాణి, వెంకటరమణ, దివాకర్ పర్యవేక్షించారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : వచ్చేనెల 10,11తేదీల్లో విశాఖ నగరంలో నిర్వహించే సిపిఐ జిల్లా 25వ మహాసభల వాల్‌పోస్టర్లను శుక్రవారం 63వ వార్డు కాకరలోవ కూడలిలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు గుడాల రాంబాబు ఆవిష్కరించారు. మహాసభల సందర్భంగా కంచరపాలెం మెట్టు జంక్షన్ నుంచి పాత ఐటిఐ జంక్షన్ వరకు కార్మికపాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ నేతలు టి.కామేశ్వరరావు, సాంబమూర్తి, రంజాన్ అప్పారావు, సురేష్ కనకేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన విలువిద్య పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : జన జాతీయ క్రీడా మహోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గీతం కళాశాల వేదికగా గిరిజన విలువిద్య పోటీల రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆంధ్రాతోపాటు ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలు, అండమాన్, నికోబార్ ద్వీప సమూహం నుండి పలుగురు గిరిజన విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, గిరిజన యువతలోని సంప్రదాయ విలువిద్య నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఒక గొప్ప వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనజాతీయ సంవత్సర క్యాలెండర్‌లో భాగంగా, గతనెల 12న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి గిరిజన చిత్రలేఖనం, కళల పోటీ నిర్వహించామని, ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 250 మంది గిరిజన కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల గిరిజనుల సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో మొత్తం 34 షెడ్యూల్డ్ తెగలు, వాటిలో 11 పివిటిజిలకు అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విలువిద్య పోటీలు ప్రారంభిస్తున్న గిరిజన సంక్షేమమంత్రి సంధ్యారాణి

గీతంలో మెటీరియల్ రీసెర్చి ల్యాబ్ ప్రారంభం

రీసెర్చి ల్యాబ్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి

ప్రజాశక్తి-మధురవాడ : నూతన పదార్థ విజ్ఞాన పరిశోధనలలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో ఏర్పాటు చేసిన గీతం మెటీరియల్ రీసెర్చి ప్రయోగశాలను శుక్రవారం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్‌పై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాలను దృష్టిలో ఉంచుకుని అధునాతన సాంకేతిక పరికరాలతో ఈ ల్యాబ్‌ను నెలకొల్పామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అందిస్తున్న పలు యుజి, పిజి సైన్స్ కోర్సులలో ప్రవేశం పొందే వారికి అధునాతన ప్రయోగశాలలు అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థి దశలోనే శాస్త్ర పరిశోధన పట్ల అసక్తి, అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్ వేణుగోపాల్ మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా రసాయనశాస్త్రంలో కోర్సులు రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ఔషధ పరిశ్రమలు ఫైజర్ హెల్త్ కేర్ లిమిటెడ్, లారెస్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, సోలార ఫార్మా వంటి కంపెనీలు గీతంలో రసాయన శాస్త్ర విద్యను అభ్యసించే విద్యార్థులకు స్పాన్సర్‌లుగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రయోగశాల పర్యవేక్షక అధికారి డాక్టర్ హరిహర పాడి మాట్లాడుతూ మెటీరియల్ రీసెర్చి ల్యాబ్‌లో పౌడర్ ఎక్స్‌ఆర్‌డితో పాటు ఎఫ్‌టిఐఆర్ స్పెక్ట్రోఫోటో మీటర్, బాల్‌మిల్, అడ్వాన్స్‌డు సింథటిక్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీలు

ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ నరేష్‌కుమార్

ప్రజాశక్తి- కలెక్టరేట్ : మలేరియా రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జివిఎంసి వద్ద అవగాహన ర్యాలీ, ఎగ్జిబిషన్ నిర్వహించారు. సిబ్బంది కృషి, ప్రజల సహకారంతో గతేడాదితో పోలిస్తే మలేరియా పాజిటివ్ కేసుల ఉధృతి తగ్గిందని, 2025లో వీటిని మరింత నియంత్రించాలని కోరారు.. మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా నిర్మూలనే ధ్యేయంగా శ్రమించాలన్నారు. జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అనంతరం మనతోనే మలేరియా అంతం అంటూ నినాదాలతో ర్యాలీ , ప్రతిజ్ఞ నిర్వహించారు..

మునగపాక : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ విమలగిరి ఆధ్వర్యంలో మునగపాక వీధులలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సిహెచ్ఓ ఆర్ దేవకాంత, సూపర్వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఎఎన్ఎం సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, డాక్టర్ హారిక, వైద్య సిబ్బంది సాయిరాం, జానకి రామన్, పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చియ్యపేట, తురకలపూడి గ్రామాల్లో మలేరియా దినోత్సవ అవగాహనా ర్యాలీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటకృష్ణ, సంధ్యా రాణి, సిబ్బంది త్రిమూర్తులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో 'దోమకాటు పెనుముప్పు' అంటూ, మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఇ.పూజ్య మేఘన, వైద్య సిబ్బంది ఎం.ఆనంద్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక పీహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్.చక్రవర్తి ఆధ్వర్యంలో స్థానిక పిఎసిఎస్ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిం చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో గొంప రమణ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ యస్.విద్యుద్దర్శి, డెంటల్ డాక్టర్ ఆషా, కె.జేసుదాసు, ఎస్. రాజశేఖర్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట, తాళ్ళపాలెం పిహెచ్‌సి పరిధిలో వైద్యాధికారులు తిరుపతి రావు, ఎం.మనీషా, సునీల్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ దినోత్సవం నిర్వహిం చారు. వైద్య సిబ్బంది ఎస్. సత్యనారాయణ, ఏవి. సుబ్బా రావు, పివి.నరసింహారావు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల పిహెచ్‌సి వైద్యాధికారి ఆధ్వర్యంలో గుండాలవీధి సాయినగర్లో మలేరియా నిర్మూలనపై ర్యాలీ, మానవహారం, అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు వైస్ ఎంపిపి విల్లూరు సూర్యకుమారి చంద్రశేఖర్, నాయకులు గోకివాడ శ్రీరాములు, వైద్య సిబ్బంది బి సంగం, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వేములపూడి పీహెచ్‌సి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అనూష మాట్లాడుతూ..దోమలు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నోడల్ పర్సన్ మల్లిబాబు, సూపర్‌వైజర్ రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట: కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధి కారులు రజిని, సురేష ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంపిహెచ్ఈఒ నూకరాజు, హెల్త్ సూపర్ వైజర్ రమాకాంతరావు, ఫార్మసిస్టు కొండబాబు, హెచ్‌వి సన్యాసమ్మ, స్టాఫ్ నర్సు నాగమణి, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీరాములనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంటలో నిర్వహిస్తున్న ర్యాలీ

నేరాలు ఘోరాలు

రిమాండ్ ఖైదీ పరారీ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న పూడి వంశీ(20) ఎస్కార్ట్ పోలీసులను తప్పించుకొని శుక్రవారం పరారయ్యాడు. విశాఖ నగరానికి చెందిన పూడి వంశీ ఒక చోరీ కేసులో పట్టుబడి కేంద్రకారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉంటున్నాడు. శుక్రవారం వాయిదా నిమిత్తంకోర్టులో హాజరుపరిచారు. కోర్టు హియరింగ్ అనంతరం కేంద్రకారాగారానికి తిరిగి తీసుకు వెళ్ళేందుకు ఎస్కార్ట్ వాహనం ఎక్కే క్రమంలో ఎస్కార్ట్‌గా వచ్చిన పోలీసుల కళ్ళు గప్పి ఉడాయించాడు. ఈ విషయమై ఎస్కార్ట్ సిబ్బంది టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు.

బైకుల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు క్రైమ్ ఎడిసిపి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఎంవిపి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోమీడియాతో మాట్లాడుతూ ఈనెల 17న సాయంత్రం పెదవాల్తేరు రిలయన్స్ మార్ట్ సమీపంలో రెడ్‌కలర్ హోండా యాక్టివా వాహనం చోరీకి గురైందని దాసరి శంకర్రావు అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా ద్వారా క్రైమ్ సిఐ వి.చక్రధరరావు ఆధ్వర్యంలో ఎంవిపి క్రైమ్ విభాగం సిబ్బంది దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక ఆధారాల సహాయంతో దొంగిలించిన వాహనం విజయనగరం జిల్లా బొబ్బిలి వెళ్లిందని గుర్తించారు. అక్కడి పోలీసుల సాయంతో సీసీటీవీ ఫుటేజ్, సెల్‌టవర్ డంప్ ఆధారంగా నిందితుడు పార్వతీపురం జిల్లా, సీతానగరం మండలం, కోట సీతారామపురానికి చెందిన కోట శివ (36)గా గుర్తించారు. అనంతరం అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా 2024 నుండి తాను బైకులు చోరీ చేస్తున్నానని, విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలోని ఎంవిపి, మహారాణిపేట, వన్‌టౌన్, టూటౌన్, 3టౌన్, ద్వారకా పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 17 వాహనాలను చోరీ చేశానని అంగీకరించాడు. వాటిలో తొమ్మిది ద్విచక్ర వాహనాలను రికవరీ చేయగా మిగిలిన వాటిలో ఎనిమిది వాహనాలను బేతనపల్లి వినయ్‌కుమార్ అనే వ్యక్తికి అమ్మటంతో అతని వద్ద నుంచి పోలీసులు రికవరీ చేశారు. మరో రెండు వాహనాలను కర్రి మోహన్‌రావు అనే వ్యక్తికి విక్రయించగా అతని వద్ద నుంచీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి శివపై ఇప్పటికే 31 పాత కేసులు ఉన్నాయని, రైల్వే వెయిటింగ్ రూముల్లో బ్యాగ్‌లు చోరీ చేసేవాడని, అతనిపై గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉందని ఎడిసిపి తెలిపారు. ఈ సమావేశంలో క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ద్వారకా క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు, ఏఎస్ఐ డి.కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు జగత్‌కిరణ్, ఎన్.హరిప్రసాద్, ఎస్.సాయి, ఎన్ అప్పలరాజు, కె అగస్టీన్‌లనుఅభినందించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పెందుర్తి :జివిఎంసి 97వ వార్డు ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో స్థానిక మహిళలు, ప్రజా సంఘాలు ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులు, ఇపుడు దాన్ని యథాస్థానంలో మళ్లీ ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేశారు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం తొలగింపును నిరసిస్తూ పిఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు యం.లక్ష్మి, భీంసేన వార్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం. వెంకటేశ్వర్లు, ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వనలత కుమారి, సందీప్, మణి, దీప తదితరులు ఆధ్వర్యంలో స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, తహశీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అంబేద్కర్ విగ్రహాన్ని చట్ట విరుద్ధంగా తొలగించిన అధికారులు, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులు మహిళలు నిలువరిస్తున్నా పట్టించుకోకుండా దౌర్జన్యంగా చేశారని ఆక్షేపించారు. దీనిపై తహశీల్దార్ ఆనందరావు స్పందిస్తూ, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ బాలాజీనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, మూది అప్పారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు
- తహశీల్దార్ కార్యాలయం వద్ద నివాసితుల ధర్నా
- జిఒ 30లో నిర్దేశించిన గడువు పెంచాలని వినతి
- 296, 388 జిఒ పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో గాజువాక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నివాసితులు

ప్రజాశక్తి-గాజువాక :ప్రభుత్వ, పోరంబోకు, ఇతరత్రా స్థలాల్లో నివాసితులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, జిఒ30లో నిర్దేశించిన గడువును 2019 అక్టోబర్ 15 నుంచి 2024 వరకు పొడిగించి దరఖాస్తు చేసుకున్న నివాసితులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. జిఒ 30 ప్రకారం కుంచుమాంబ కాలనీ స్వతంత్రనగర్, రాంనగర్, అప్పన్నకాలనీ, రామచంద్రనగర్ గ్రామాల్లో నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కుంచుమాంబకాలనీ, స్వతంత్రనగర్ నివాసితులు ఇళ్లపట్టాలకు దరఖాస్తు చేసుకుంటే చెరువులు, వాగులంటూ కుంటిసాకులు చెబుతూ పట్టాలు జారీకి అభ్యంతరాలు చెప్పడం సరికాదన్నారు. గాజువాకలోని వం ం డ ల రె వె న్యూ జివిఎంసి జోనల్ కార్యాలయం, కోర్టు, పిహెచ్‌సి ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వాగు ఒడ్డునే ఉన్నాయని, వాటికి లేని అభ్యంతరం నిరుపేదలకు ఇళ్లపట్టాలు మంజూరుకు ఎందుకని ప్రశ్నించారు. వెంటనే జిఒ 30 ప్రకారం అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

అలాగే 2017, 2019లో గత టిడిపి ప్రభుత్వ హయాంలో 296, 388 ప్రకారం పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేశారని, రెండేళ్ల తర్వాత వాటికి రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు జరగలేదన్నారు ఆయా పట్టాదారులకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, స్వతంత్రనగర్, కుంచుమాంబ కాలనీ నివాసితులు నలభై ఏళ్లుగా నివాసముంటూ ఆస్తిపన్నులు, వాటర్‌ట్యాక్స్, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారని, శాశ్వత నివాసితులుగా అన్ని ఆధారాలున్నా వారికి పట్టాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే తగు చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు గాజువాక జోన్ అధ్యక్షులు డి రమణ, కార్యదర్శి ఎ.లోకేష్, కిరీటం, సంతోషం బంగారు నాయుడు పాల్గొన్నారు.

30న పాలిసెట్

29లోగా పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈ నెల 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందని స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు పత్రం (ఆధార్ కార్డు), హెచ్‌బి పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్, ఎరైజర్, షార్పెనర్ వెంట తీసుకుని ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రంలోకి రావాలన్నారు.

పాలిసెట్ దరఖాస్తు సమయంలో ఫీజు పేమెంట్ ఫెయిలై, హాల్ టికెట్ పొందలేకపోయిన విద్యార్థులు సంబంధిత విద్యార్థుల దరఖాస్తు, రెండు పాస్ ఫోటోలు, ఆధార్ నంబర్, ఎస్ఎస్‌సి హాల్ టికెట్‌తో ఒసి, బిసి విద్యార్థులు రూ.400, ఎస్‌సి ఎస్‌టి విద్యార్థులు రూ.100 పరీక్ష రుసుముతో ఈనెల 29న సాయంత్రం 4గంటలలోగా తమ కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని సూచించారు

నేడు యంగ్ అడ్వకేట్స్ కన్వెన్షన్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, విశాఖపట్నం యూనిట్ ఆధ్వర్యంలో శనివారం యంగ్ అడ్వకేట్స్ కన్వెన్షన్ డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఐలు విశాఖ యూనిట్ గౌరవాధ్యక్షుడు బి.వి.రామాంజనేయ తెలిపారు. ఈ కన్వెన్షన్‌కు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంకె శ్రీనివాస్, ఆలిండియా ఐలు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, ఆంధ్ర యూనివర్సిటీ లా కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె సీతామాణిక్యం, యంగ్ అడ్వకేట్స్‌తో ఇంట్రాక్ట్ అవుతారన్నారు.కార్యక్రమానికి 500 మంది యువ న్యాయవాదులు రానున్నారన్ని ఐలు జిల్లా అధ్యక్షులు అల్లు సురేష్ కుమార్, జనరల్ సెక్రెటరీ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌సిసి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి పూర్తిచేసుకున్న 2023-25 బెస్ట్ బ్యాచ్ విద్యార్థులకు శుక్రవారం ఎన్‌సిసి 'ఎ' సర్టిఫికెట్లను అందజేశారు. విశాఖపట్నం జిల్లాలో జివిఎంసి పాఠశాలల్లో ఎన్‌సిసి ఉన్న ఏకైక పాఠశాలగా అక్కయ్యపాలెం ప్రసిద్ధి పొందింది. 11 ఆంధ్ర ట్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ ఎంఎన్‌వి. విశ్వనాథం ఆధ్వర్యంలో 2023 జూన్ నెలలో పాఠశాలలో ఎన్‌సిసి విభాగం జెడి, జె డబ్ల్యు ట్రూప్ ఆవిర్భవించింది. మొదటి సంవత్సరం 40 తరగతులు, రెండో సంవత్సరం 40 తరగతులు, ఒక యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో శిక్షణ పొంది 375 మార్కులు లిఖిత పరీక్షలో 125 మార్కులు (డ్రిల్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రేటింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో మౌఖిక పరీక్ష నిర్వహించగా, 500 గాను 400 మార్కులు దాటిన వారికి ఎ గ్రేడ్, 300-360 మార్కులు దాటిన వారికి బి గ్రేడ్, 300-359 వచ్చిన వారికిను సీ గ్రేడ్ సర్టిఫికెట్ అందజేశారు. పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ఎన్‌సిసి క్యాడెట్ మలాపురం దినేష్‌కు రూ.ఆరువేల చెక్కును కల్నల్ అజయ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ జయ ప్రకాష్, హవల్దార్ శ్యామలరావు పాల్గొన్నారు. విద్యార్థి అమలాపురం దినేష్‌ను హెచ్‌ఎం బి. లక్ష్మీనరస, పాఠశాల పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పలరాజు అభినందించారు

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు ఈ నెల 30వరకు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్ర వారం పట్టణ ప్రముఖులు రామకృష్టానంద జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ముఖ్య అతిథి స్థానిక సిఐ బి తిరుమలరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి ఈ తరహా శిక్షణాశిబిరాలు దోహద పడతాయన్నారు. చదువుతో పాటు ఆటపాటల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. రచయిత బులుసు వెంకటేశ్వర్లు తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. సభాధ్యక్షత వహించినకళాసాహితి సంస్థ అధ్యక్షులు పి రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మేధోశక్తి, సృజనాత్మకతను వెలికి తీయడం లక్ష్యంగా తమ సంస్థ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంస్థ సభ్యులు పిట్ట సురేష్ స్థానికులు రేలంగి పెదబాబు, సత్య నారాయణ పట్నాయక్, చంద్ర మౌళేశ్వరరావు, ఎస్ జోగారావు, కె సన్యాసి నాయుడు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

పిఎఫ్ కమిషనర్‌ను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులు, సిబ్బంది పెన్షన్ సమస్యను పరిష్కరించాలని చిట్టివలస ప్రాంత ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు కోరారు. శుక్రవారం నగరంలోని పిఎఫ్ కమిషనర్ అవినాష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 350 మంది రిటైర్డు జ్యూట్ కార్మికులు, సిబ్బంది 10డి దరఖాస్తులు సమర్పించి ఏడేళ్లు కావస్తున్నా వారికి నేటికీ పెన్షన్ మంజూరు కాలేదన్నారు.

దరఖాస్తులు చేసుకున్న వారిలో ఇప్పటికే కొందరు మృతి చెందారని, ఈ నేపథ్యంలో మరోమారు 10డి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాల్సిందిగా యాజమాన్యానికి మరోమారు ఆదేశాలు జారీ చేయాలని పిఎఫ్ కమిషనర్‌ను కోరారు. ఆయా దరఖాస్తులు వచ్చిన వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు ఉన్నారు

మురళీ మాధవ విద్యాలయంలో శత శాతం ఉత్తీర్ణత

విద్యార్థిని అనురాధతో మురళీధర్, సత్యవతి

ప్రజాశక్తి- మాధవధార : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మాధవధార మురళీ మాధవ విద్యాలయం శతశాతం ఫలితాలతో ప్రభంజనం సృష్టించింది. పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కూన అనురాధ అనే విద్యార్థిని 582 మార్కులు సాధించింది. తల్లి రూప, తండ్రి రమణ ఇద్దరూ రోజువారీ కూలీలైన, విద్యార్థి అనురాధ ఉపాధ్యాయుల సహకారంతో చక్కని ప్రణాళికతో చదివి ఈ మార్కులు సాధించాలని తెలిపింది. మురళీ మాధవ విద్యాలయం కరస్పాండెంట్ సనపల మురళీధర్ మాట్లాడుతూ 17 మంది విద్యార్థులు పరీక్షలు రాసి పాసవ్వగా, వారిలో తొమ్మిది మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మురళీధర్, ప్రిన్సిపల సనపల సత్యవతి,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సూర్యకళ మృతికి సంతాపం

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు జగ్గునాయుడు, గంగారావు

సూర్యకళ (ఫైల్)

ప్రజాశక్తి -మాధవధార : యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూన సత్యనారాయణ సోదరి ఎండ సూర్యకళ(50) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మాధవధారలో సత్యనారాయణ ఇంటి వద్ద సూర్యకళ భౌతికకాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి గంగారావు, సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ పద్మనాభరాజు, జక్కన సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె సుధాకరరావు, ఐద్వా నాయకులు అన్నపూర్ణ, పద్మ, సుజాత, సిపిఎం, ఇతర ప్రజాసంఘాల నేతలు పెద్దసంఖ్యలో వచ్చి నివాళులు అర్పించారు. అనంతరం మాధవధార శ్మశానవాటికలో సూర్యకళ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

బెహరాకు మహిళల అభినందన

ప్రజాశక్తి-గోపాలపట్నం: జివిఎంసి 91వ వార్డు మహిళాసంఘాల ప్రతినిధులు శుక్రవారం బెహరా భాస్కరరావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వైసిపిని వీడి జనసేనలో బెహరా చేరిన సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, తాము వెంటే ఉంటామని బెహరాకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, కె.సునీత, ఎస్.సుహాసిని, ఎం.వరలక్ష్మి,జి.నాగమణి పాల్గొన్నారు.

సంజీవరావును కలిసిన భోగవిల్లి

ప్రజాశక్తి- ములగాడ: ఇఎన్‌టియుసి అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డిని హైదరాబాదులో అతని నివాసంలో జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ భోగవిల్లి నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిసి, నగరంలోని పలు కంపెనీల పరిస్థితులు, కార్మికుల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా భోగవిల్లి మాట్లాడుతూ, విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆరునెలలుగా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించకపోవడం, పలువురి శాశ్వత ఉద్యోగుల విఆర్‌ఎస్, దాదాపు 12వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఉద్వాసన, తదితర అంశాలను వివరించినట్లు తెలిపారు. దీనిపై ఇంటక్ జాతీయ అధ్యక్షుడు స్పందించి, సమస్యలపై యూనియన్ సమావేశాల్లో చర్చించి, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూనియన్ ద్వారా కృషి చేస్తానన్నారు. ఇంటక్ జాతీయ కార్యవర్గసభ్యుల అడ్రస్‌లతో కూడిన డైరీని ఆవిష్కరించారు.

విద్యుత్ కోతలతో విలవిల

ప్రజాశక్తి - ఆరిలోవ : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు అప్రకటిత విద్యుత్ కోతలు అల్లాడి స్తున్నాయి. ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో అధికారికంగా కొన్ని గంటలు, అనధి కారికంగా మరి కొన్ని గంటలు వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ ంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉక్కపోతతో వృద్ధులు, రోగులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు విద్యుత్ సరఫరా అంతంత మాత్రంగా ఉన్నా, బిల్లులు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : ప్రకృతి వ్యవసాయంపై భీమిలి మండలం దాకమర్రిలో శుక్ర వారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంలో సాగు వల్ల ప్రయోజనాలను వివరించారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన రావు, సిబ్బంది పాల్గొన్నారు

రెండో రోజూ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ధర్నా

జీతాలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచాలని కోరుతూ రెండో రోజు శుక్రవారం కూడా ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్, హైర్ బస్ డ్రైవర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసి ఆరు నెలలు అవుతున్నా జీతాలు పెంచకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ అమలు చేయాలని, యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలని, 1/2019 సర్కులర్ అమలు చేయాలని, డ్రైవర్లపై వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ సిఐటియుతో అద్దె బస్సు యజమానుల సంఘం 2022లో ఒప్పందం చేసిందని, ఒప్పంద కాలపరిమితి ముగిసి ఆరు నెల కావస్తున్నా జీతాలు పెంచలేదని పేర్కొన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, కాని వేతనాలు పెరగడం లేదన్నారు. ఆర్టీసీ డ్రైవర్లతో సమానంగా పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల జీవితాలు మాత్రం దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం ఎక్కడా అమలు చేయడం లేదని తెలిపారు. చిన్న కారణాలతో తొలగింపులు చేస్తున్నారన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు.

ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

ఆర్టీసీ యాజమాన్యం బాధ్యత వహించి జీతాలు పెంపుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే మే ఒకటి తరువాత సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎంపీ నాయుడు, చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బదిలీల్లో పారదర్శకత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీస్ బదిలీల్లో పారదర్శకతతో ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. జిల్లాలో 283 మంది పోలీస్ సిబ్బందికి సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఒకే పోలీస్‌స్టేషన్లో 5 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించిన ప్రక్రియను అదనపు ఎస్పీలు పర్యవేక్షించారు. ఖాళీగా ఉన్న పోస్టులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి వివరిస్తూ సీనియార్టీ ప్రకారం వారికి ఇష్టమైన స్టేషన్లను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. మొత్తం 283 మందికి బదిలీ ఆదేశాలు జారీ కాగా, వారిలో 161 మంది పోలీస్ కానిస్టేబుల్స్ ఉన్నారు. 57 మంది మహిళలు, 95 మంది హెడ్ కానిస్టేబుల్స్, 27 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, పరిపాలన అధికారి ఎ.రామ్‌కుమార్, ఎస్సై సురేష్‌బాబు, సూపరిం టెండెంట్ గిరి ఈ ప్రక్రియను నిర్వహించారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

ప్రజాశక్తి-అనకాపల్లి: పహల్గాంలో పర్యాటకుల మీద దాడి అమానుష చర్య అని అఖిలపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానిక సిపిఐ కొడిగంటి గోవిందరావు భవనంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ సూది కొండ మాణిక్యాలరావు తదితరులు మాట్లాడుతూ పర్యాటకుల మీద దాడి అమానవీయమని ఇటువంటి దుర్మార్గ చర్యలను ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని కోరారు. దేశంలో ఉగ్రవాదుల దుశ్చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేత మత్తుర్తి సూరిబాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విపత్తులపై అవగాహనకు మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-రాంబిల్లి రాంబిల్లి మండలం, పంచదార్ల గ్రామం కోనేరు వద్ద జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం వారు శనివారం ఉదయం 9 గంటలకు మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, ఇతర శాఖ అధికారులు సిబ్బంది ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయం ఎనిమిదో వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము, కమిటీ అధ్యక్షులు బొడ్డేడ రాము, శరగడం గోవింద, దివాకర్, బొడ్డేడ అప్పారావు, బొడ్డేడ శ్రీను, అక్షయ తేజ ఫౌండేషన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ దినోత్సవంలో సర్పంచ్ మంగ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం పంచాయతీ సర్పంచ్ బలిజ మంగ ముసలినాయుడు మంగళగిరిలో సీకే.కన్వెన్షన్స్ గురువారం జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవంలో పాల్గొన్నట్లు శుక్రవారం ఆమె తెలిపారు. జిల్లాలో 9 మంది సర్పంచులను ఆహ్వానించారని దీనిలో భాగంగా తనకు కూడా ఆహ్వానం అందడంతో వెళ్లానని తెలిపారు. ఈ అవకాశం రావడానికి కారణమైన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జనసేన నియోజకవర్గం ఇన్ చార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ)కి ధన్యవాదాలు తెలిపారు

రాష్ట్రస్థాయి పంచాయతీ రాజ్ దినోత్సవంలో పాల్గొన్న మంగ

రుతు పవనాల ముందు సాగుతో భూసారం

ప్రజాశక్తి- అనకాపల్లి : వేసవిలో రుతుపవనాల ముందు పొడి నేలలో సాగు చేసుకునేందుకు 20 నుంచి 30 రకాల విత్తనాలను కలిపి వెదజల్లి భూమిని ఎల్లప్పుడూ కప్పి ఉంచే ప్రక్రియ ద్వారా రైతులకు ఆదాయంతో పాటు భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్‌రావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ లచ్చన్న తెలిపారు. ఈ విధానంలో కలుపు ఉధృతి తగ్గడంతో పాటు పశువులకు నాణ్యమైన మేత లభిస్తుందని, ప్రకృతి వ్యవసాయ పంట సాగు సేంద్రియ కార్బన్‌ను పెంపొందిస్తుందని తెలిపారు. విత్తనాల్లో పప్పు, నూనె జాతులు, సుగంధ ద్రవ్యాలు, ధాన్యపుజాతి, వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయశాఖ నుంచి పచ్చిరొట్ట, పశు సంవర్ధక శాఖ నుంచి గడ్డి రకాలు లభిస్తాయన్నారు. రైతులు వద్ద అందుబాటులో ఉన్న అపరాలు రకాలు కలిపి మొత్తం 12 కేజీల విత్తనాల కిట్టు రైతులకు అందజేస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలో 14 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు.

ఎంపీ సిఎం రమేష్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌ను బుచ్చెయ్యపేట మండల టిడిపి, జనసేన నాయకులు శుక్రవారం అనకాపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, ఎలంకాయల అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, దొంకిన అప్పలనాయుడు, ఎంపివి సత్యనారాయణ, దొండ సన్యాసిరావు, కృష్ణ, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లి జిల్లా కో ఆపరేటివ్ సహకార సంస్థ అధికారి ఎ.ప్రేమస్వరూపరాణి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. దంత పరీక్షలు, జనరల్ చెకప్‌లు సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేర్ హాస్పిటల్‌కి 20 మందిని , ఐ హాస్పిటల్‌కి 40 మందిని, డెంటల్ హాస్పిటల్‌కి 35 మందిని, క్యాన్సర్ హాస్పిటల్‌కి 30 మందిని రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సహకార సంస్థ అధికారి పివిఎన్.కిరణ్‌కుమారి, పిఐసి, పివిఎన్ శాస్త్రి, స్థానిక పిఎసిఎస్ సీఈవో గొంప రమణ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొండా సత్యారావు, పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ డి. ప్రసాదరావు, మాజీ వైస్ చైర్మన్ పల్లాకృష్ణ, వార్డు సభ్యులు చిత్రాడ శ్రీనివాసరావు, స్వర్ణలత, రాంబాబు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పిఎసిఎస్ సిబ్బంది గొంప దేముడు, శ్రీరామరెడ్డి రామకృష్ణ, కె.రాజు, టి రామకృష్ణ, జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సమీక్షా సమావేశంలో స్పీకర్ అయ్యన్న, మంత్రి అనిత, ఎంపీ రమేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్ వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, దీనికి కావలసిన మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, నర్సీపట్నం మెడికల్ కాలేజీపై చర్చ జరిగిందన్నారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పూర్తి నిర్మాణం కోసం నాబార్డ్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. లేకుంటే సిఎస్ఆర్ నిధులు రూ.9 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో పోలీస్‌శాఖ మానిటరింగ్‌తో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సిఎస్ఆర్ నిధులు రూ.250 కోట్లతో ఏర్పాటు చేస్తామని, తద్వారా శాంతిభద్రతల సమస్య లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. రైల్వే, తాగునీరు, రోడ్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పార్లమెంటు పరిధిలో సిగ్నల్ సమస్య లేకుండా 40 టవర్లు వేయడం జరుగుతుందన్నారు. అనకాపల్లికి కేంద్రీయ విద్యాలయం మంజూరైన నేపథ్యంలో ఇంకా అవసరమైన విద్యాలయాల ఏర్పాటుకు సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించేందుకు కలెక్టర్‌కు సూచించినట్లు చెప్పారు. జిల్లాలో రెండు లక్షల మంది ప్రైవేటు ఉద్యోగులు, 50,000 మంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్నారని, వారి పిల్లల కోసం కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రి సహకారంతో కృషి చేస్తామన్నారు. సమావేశంలో శాసనసభ్యులు బండారు సత్యనారాయణ, సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేష్ బాబు, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జెసి ఎం.జాహ్నవి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కామిరెడ్డి వెంకటరావు, కార్యదర్శిగా చీపురుపల్లి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎల్లారావు, సహాయ కార్యదర్శిగా జిపిఎ.సత్యనారాయణ, కోశాధికారిగా పైడిరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్‌గా చందు, లైబ్రరీ వారాది రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మహాదేముడు ఎన్నికయ్యారు. తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న న్యాయవాదులకు నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు న్యాయవాదులు కోర్టు సిబ్బంది అభినందించారు.

కామిరెడ్డి వెంకటరావు, చీపురుపల్లి సూర్యనారాయణ

స్టేషన్ రోడ్డు తక్షణమే నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పెరుగుబజార్ నుంచి స్టేషన్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను తక్షణమే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పెరుగు బజార్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుబజార్ జంక్షన్ నుండి రైల్వేస్టేషన్ రోడ్డు రహదారిలో వ్యాపారస్తులు, చిరు వ్యాపారులు గత రెండేళ్లుగా వ్యాపారాలు దెబ్బతినడంతో ఎంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి జోనల్ కమిషనర్ బి.వి.రమణ, స్థానిక పార్లమెంట్ సభ్యులు సిఎమ్.రమేష్, స్థానిక ఎమ్.ఎల్.ఏ. కొణతాల రామకృష్ణ, 84 వవార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఈ విషయములపై తక్షణమే స్పందించి నిర్మాణం పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థకార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఊడా నాగేశ్వరరావు, స్థానికులు బట్టు సూరిబాబు, మజ్జి ప్రకాశరావు, రాపాక రాము, లాలం తులసీ రామ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జబర్దస్త్ సత్తిపండు తదితరులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శ్రీలలితా స్కూల్ ఆఫ్ డాన్స్ హైదరాబాద్ సింధూరి, శివ మోహనం డాన్స్ స్కూల్, రాధాకష్ణ కళాక్షేత్రం రాజమండ్రి, జీవీ నారాయణరావు, వై లలిత సింధూరి, జై కిషోర్, పద్మవాణి చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీలా నాగ వెంకట సత్యనారాయణ (జబర్దస్త్ సత్తిపండు), కేపీవి రమణయ్య, సబ్బవరపు గణేష్ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ డైరెక్టర్, పంచదార్ల సూరిబాబు లక్ష్మి, పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వేదికపై జబర్దస్త్ సత్తిపండు చేసిన స్కిట్లు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో నూకాంబికా దేవస్థాన చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా అదనపు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎంవిఎస్.కె.బాలాజీ ఆకస్మికంగా శుక్రవారం సందర్శించారు. పిహెచ్‌సిలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సమీక్షించి, రికార్డులు పరిశీలించారు. ప్రగతి శతశాతం సాధించాలని ఆదేశించి తగు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఏ.మనీషా, వి.ఏ.సుబ్బారావు, ఆరోగ్య విస్తరణాధికారి, ఎం.ఎస్.వి.ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహారావు, ఆర్.వెంకటలక్ష్మి ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పంట కాలువ పనులు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉపాధి హామీ నిధులతో అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో దీప్తి పంట కాలువ పనులు చురుగ్గా సాగుతున్నాయని జనసేన మండల అధ్యక్షులు చదరం నాగేశ్వరరావు, నీటి సంఘం చైర్మన్ పీలా సీతారాం పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులతో దిబ్బపాలెం నుంచి శంకరం గ్రామం వరకు ఉన్న దీప్తికాలువ వలన సుమారు ఐదు గ్రామాల ఆయకట్టు రైతులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. దిబ్బపాలెం, ఊడేరు, బగులవాడ, తుమ్మపాల, శంకరం గ్రామాల్లో సుమారు 300 మందికి చెందిన 3 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని చెప్పారు. గత కొంతకాలంగా సిల్ట్ తొలగించకపోవడం, తుప్పలు పేరుకుపోయి సాగునీటికి ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

కష్టపడేవారికి పార్టీలో న్యాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో అచ్చెర్ల, తాళ్ళపాలెం గ్రామంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేందర్ టిడిపి బూత్, గ్రామ కమిటీలు ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తాళ్ళ పాలెంలో సుందరుపు పెద అప్పారావుకు సిఎం రిలీఫ్‌ఫండ్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతి నిధి గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, నైనముశెట్టి రమణరావు, వుల్లింగల రమేష్, కలగ సోమేశ్వరరావు, కడిమిశెట్టి నరసింహారావు నిమ్మదల సన్యాసినాయుడు, కలగా సోమేశ్వరరావు, ద్వారపురెడ్డి సత్తిబాబు, ఆంధ్ర ప్రసాద్ పాల్గొన్నారు.

27న నూకాంబిక నెల పండగ

ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి గవరపాలెం నూకాంబికా అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 27న ఆదివారం నెలపండగ సందర్భంగా అమ్మవారికి అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు. ఈ మేరకు ఆ రోజు సాయంత్రం 4.30 నుండి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 5 నుంచి దర్శనం యధావిధిగా సాగుతుందన్నారు. భక్తులు సహకరించాలని కోరారు.

విశాఖలో టమాటాల విక్రయానికి అనుమతివ్వాలి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం పరిసర గ్రామాల రైతులు పండిస్తున్న టమాటాలను విశాఖపట్నం రైతు బజార్లు, ఇతర ప్రాంతాల్లో విక్రయించడానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్‌రావుకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ అనకాపల్లి మండలం సిరసపల్లి, వల్లూరు, గొర్లివానిపాలెం, గవర్ల అనకాపల్లి, అసకపల్లి ప్రాంతాల రైతులు టమాటాలు పండించి రోజుకు సుమారు 30 టన్నుల వరకు విశాఖపట్నం రైతు బజార్లు, ఇతర ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా విక్రయిస్తున్నారని తెలిపారు. అయితే ఈ మధ్య విశాఖపట్నం అగ్రికల్చర్ అధికారులు అనకాపల్లి జిల్లా టమాటాలను కాదని, చిత్తూరు నుండి వచ్చే టమాటాలు విక్రయించడానికి అనుమతి ఇవ్వడంతో అనకాపల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా అన్యాయమన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి ఉమ్మడి జిల్లాగా వున్నప్పటి నుండి విశాఖపట్నం మార్కెట్‌గానే టమాటాలు అమ్ముకోవడం జరుగుతుందని, అనకాపల్లి పట్టణం గ్రేటర్ విశాఖలో వుందని, అనకాపల్లి జిల్లా నుండి వచ్చే కాయగూరలు, టమాటాలను రైతులు అమ్ముకోవడానికి మొదటి ప్రాధాన్యత కల్పించిన తరువాతే ఇతర జిల్లాలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యుద్ద ప్రాతిపదికన విశాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల వారీగా రైతుల వివరాలు, టమాట కేట్లు, పంట పండించే భూమి విస్తీర్ణం వివరాలను అధికారుల దృష్టికి తీసుకు వెళు_తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, కాళ్ల తేలయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్

అమర్‌నాథ్‌ను సత్కరించిన పైల శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి-పరవాడ

వైసిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం మింది గ్రామంలోని ఆయన స్వగృహంలో అమర్నాథ్‌ను శుక్రవారం వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పైల శ్రీనివాసరావు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తమ పార్టీ కార్యకర్తలపై కక్షపురితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనను గురించి ప్రజల్లోకి తీసుకువెళ్తూ, పార్టీ బలోపేతానికి కషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు తప్పకుండా ఉంటుందన్నారు. గుడివాడ అమర్‌నాథ్‌ను జిల్లా అధ్యక్షులుగా నియమించడంపై వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి పైల శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. గుడివాడ అమర్నాథ్ నియామకంతో పార్టీ పూర్వవైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, రాష్ట్ర మాజీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ దాలయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు, బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలం

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు నాగరాజు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : సమైక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని ఎల్ఐసి ఏఓఐ (సిఐటియు) విశాఖ డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు అన్నారు. చోడవరంలో స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ అధ్యక్షుడు మోహన్ అధ్యక్షతన శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏజెంట్లు, బ్రాంచి అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే పాలసీదారులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. డివిజన్ కార్యదర్శి రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ కార్పొరేషన్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏజెంట్లు మారాలన్నారు. డివిజన్ కోశాధికారి త్రిమూర్తులు మాట్లాడుతూ బ్రాంచిలో అధికారులు సహకరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఏజెంట్లు తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఎల్ఐసికి ఏజెంట్లే పునాది అని పేర్కొన్నారు. పలువురు ఏజెంట్లు మాట్లాడుతూ చోడవరం బ్రాంచ్లో పాలసీదారులకు అందించే కొన్ని సేవలలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సర్వీసుకి అక్నాలెడ్జిమెంట్ ఇచ్చేలా చూడాలని యూనియన్ నేతలను కోరారు. సమావేశంలో స్థానిక కార్యదర్శి మజ్జి శంకర్రావు, కోశాధికారి శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు వరహాల నాయుడు, రమణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక గాంధీ గ్రామం, గవర్నమెంట్ హైస్కూల్‌లో శనివారం 23 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో పదోతరగతి, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, పిజి వరకు చదువుకుని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉన్న యువత హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువత తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా బయోడేటా, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్‌లతో శనివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9494791935, 7981102224 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కిశోర బాలికలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-పరవాడ : కిశోర బాలికలకు పలు విషయాలపై అవగాహన అవసరమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారి పి.లక్ష్మి పేర్కొన్నారు. పరవాడ మండలం, కన్నూరు పంచాయతీ సచివాలయంలో మహిళా పోలీస్ డి.స్వరూప ఆధ్వర్యంలో బాలల సంక్షేమ రక్షణా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల అనర్థాలు, డ్రాప్ అవుట్స్, స్కూల్లో చేర్పించడం, పోక్స్‌చట్టం వంటి విషయాలను తెలియజేశారు. 11 నుండి 15 సంవత్సరాలు వయసు ఉన్న కిశోర బాలికలకు శారీరకంగా వస్తున్న మార్పులు గురించి, వారు తీసుకునే పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అంగన్వాడి వర్కర్స్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గున్నేంపూడిలో మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన తాగునీటి బోరు నిర్మాణ పనులను శుక్రవారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు డొంకన అప్పల నాయుడు, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, అడ్డూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి, కె.కోటపాడు : మే 5 6 7 తేదీల్లో ఎలమంచిలిలో జరుగు సిపిఐ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్లె దేవుడుబాబు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కే.కోటపాడులో మహాసభ కరపత్రాలను వారు విడుదల చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, జిల్లాలో మూతపడిన చక్కెర కర్మాగారాలను పున:ప్రారంభించాలని, రైతులకు కార్మికులకు బకాయిలు చెల్లించాలని, ఎస్సీ జెడ్ ఫార్మాసిటీల్లో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని వంటి సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

పాల సొసైటీ డైరెక్టర్‌గా దాలినాయుడు

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ పాల సొసైటీ డైరెక్టర్‌గా జనసేన పార్టీకి చెందిన దరిమిశెట్టి దాలినాయుడును నియమించారు. రెండు డైరెక్టర్ల స్థానాలకు నియామకం జరగగా ఒకటి టిడిపి మరొకటి జనసేనకు ఏకగ్రీవంగా తీర్మానించి నియమించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడవక నూకరాజు బండి గోపి కరణం శేఖరు వేపాడ అప్పారావు, ఏడవక శీను, నీటి సంఘం డైరెక్టర్ ఏడవ శంకర్రావు, కోటిని పరదేశి నాయుడు, అల్లం శీను పాల్గొన్నారు.

దాలినాయుడును అభినందిస్తున్న దృశ్యం

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- మాడుగుల:అధిక దిగుబడులు సాధించా లంటే భూసార పరీక్షలు తప్పనిసరిని మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. శు క్రవారం మాడుగుల గ్రామంలో భూసార పరీక్షల నిమిత్తం చేస్తున్న మట్టి నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని అన్ని గ్రామాలు కలిపి 1390 మట్టి నమూనాలను సేకరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతుల పొలాలలో మట్టి నమూనాలను సేకరించి తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకో వాలని, చిన్న, సన్న కారు రైతుల పొలాలలోను ఎస్సి, ఎస్టీ కేటగిరికి చెందిన రైతుల పొలాలోను తప్పని సరిగా నమూనాలను సేకరించాలని కోరారు. సమస్యాత్మక భూములలోను, దిగుబడులు తక్కువగా నమోదవుతున్న భూములలో మట్టి నమూనాలను సేకరించి అనకాపల్లిలో భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని సిబ్బందికి తెలియజేశారు.మట్టి నమూనాల సేకరణకు ఈ వేసవి కాలమే అనుకూలమని రైతులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకొని సాయిల్ హెల్త్ కార్డు పొందాలని,కార్డులో సూచించిన విధంగా ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

చీడికాడ:రైతు సేవ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి ఒక్కరు కూడా ఆయా కేంద్రాల్లో రైతు పొలాల నుండి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడికాడ మండలంలో 13 రైతు సేవ కేంద్రాల ద్వారా రైతుల పొలాల నుంచి 1045 మట్టి నమూనాల సేకరించి పరీక్ష నిర్వహించి రైతులకు తెలియ జేయాలన్నారు.పొలాల్లో మట్టి సాంద్రతను బట్టి ఎరువుల వినియోగం తగ్గించి అధిక దిగుబడి పొందాలన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మక్కువ చూపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చీడికాడలో పరీక్షలు చేస్తున్న అధికారులు

వాటర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

-జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి:వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని ఉద్దండపురంలో సిపిడబ్ల్యూఎస్ వాటర్ ప్రాజెక్టును శుక్రవారం డిపిఒ శిరీషా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామిలతో కలిసి పరిశీలించారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు కుళాయిలు ద్వారా నిరంతరం తాగునీరు సరఫరా అయ్యేటట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి సీతారామరాజు, ఆర్ డబ్ల్యు ఎస్ డిప్యూటీ ఇఇ ఆనంద్, జయరాం, ఇన్చార్జి ఇఓపిఆర్డి ఎం.శ్రీను, వాటర్ ప్రాజెక్టు జేఈ వంశీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఇత్తడి సామగ్రి అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి క్షేత్రానికి ఉద్దండపురం గ్రామానికి చెందిన ధాతారం మురళీకృష్ణ, విశ్వ మోహిని దంపతులు ఇత్తడి పూజా సామగ్రిని బహుకరించారు. అమ్మవారికి అర్చనలు, పూజలు చేసేందుకు గాను ఇత్తడి పళ్లెం, శఠగోపం, హారతి కుందెలను శుక్రవారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజుకు మురళీకృష్ణ కుటుంబ సభ్యులు అందజేశారు. తిరుపతి పద్మావతి నగర్ లోని రామాలయ అర్చకులు గురురాజారావు సహా పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నక్కపల్లి: రానున్న విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు పేద పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ కే.నరేష్ తెలిపారు. ఈ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్‌లో చేసుకోవాలని తెలియజేశారు.ప్రతీ ప్రైవేట్ పాఠశాల http://cse.ap.gov.in వెబ్సైట్ లో తప్పనిసరిగా రిజిస్టర్ కావాలన్నారు. తదుపరి ఈనెల 28 నుండి మే15 వరకు సదరు వర్గాల వారికి 25 శాతం కోటా కింద ప్రవేశం పొందడానికి పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు.విద్యార్థుల ఆధార్ ద్వారా ఆన్ లైన్‌లో రిజిస్టర్ అయి వివరాలు పొందవచ్చున్నారు. అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.

ఇ - కామర్స్ మోసాలపై పోరాటం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: భారతదేశ మార్కెట్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్ ఎక్కువగా జరుగుతున్న కారణంగా, మోసాలు కూడా అదే తరహాలో జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు అమెజాన్ ఇండియా ఒక బహుళ స్థాయి నూతన విధానాన్ని రూపొందించినట్లు ఆ సంస్థ ప్రైమ్ విభాగ హెడ్ అక్షయ్ సాహీ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సామాజిక మాధ్యమంలో ఇకామర్స్ ఎంటర్ ప్రైజ్, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాంలలో మోసాలకు అవకాశాలు ఎక్కువ ఉన్నాయనిఇటీవల పిడబ్ల్యుసి ఇండియా గణాంకాలు బట్టి తెలుస్తోందన్నారు. వీటిని అరికట్టేందుకు అమెజాన్ రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. సురక్షితమైన,నమ్మకమైన షాపింగ్ వాతావరణాన్ని కేటాయించడానికి చొరవ కస్టమర్లకు సురక్షితమైన, నమ్మకమైన షాపింగ్ వాతావరణాన్ని నిర్ధారించడానికి తమ సంస్థ చొరవను అమలు చేసిందన్నారు. ఇందుకోసం 24/7 కస్టమర్ మద్దతు కోసం తమ కస్టమర్ సర్వీస్ సెంటర్ ఎల్లప్పుడూ పనిచేస్తుందని చెప్పారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

- ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్

ప్రజాశక్తి- కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో సారా రహిత గ్రామాలే లక్ష్యంగా ఎక్సైజ్ సిబ్బంది పటిష్ట నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో సందర్శించారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే 42 కేసులతో పాటు 32 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామని 178 లీటర్లు సారాతోపాటు 7200 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసామన్నారు. 41 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో అక్నాహెబ్ పేట, నీలిగుంట, పాములవాక, జగ్గంపేట, చిన్నబొడ్డేపల్లి సహా పలు గ్రామాలలో సారా నిర్మూలనకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు, గ్రామ స్థాయి నాయకులతో కమిటీ ఏర్పాటు చేస్తామని కమిటీలో తహసీల్దారు, స్థానిక ఎస్సై, ఎక్సైజ్ ఎస్సై, స్థానిక వీఆర్వో ఉంటారన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్టు దుకాణాలపై చర్యలు చేపడతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాయకులతో పాటు యువకుల్లో చైతన్యం రావాలని, సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు సహకరించాలని కోరారు.

డంపింగ్ యార్డును పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:డంపింగ్ యార్డ్ నిర్వహణను పక్కాగా చేపట్టాలని డిపిఒ శిరీషా రాణి సూచించారు. మండలంలోని ఉద్దండపురంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో డి సీతారామరాజుతో కలిసి ఆమె పరిశీలించారు. వర్మి కంపోస్టు తయారీ, చెత్త సేకరణ విధానాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించి సంపదను సృష్టించాలన్నారు. తడి పొడి చెత్త సేకరణ పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇన్చార్జ్ ఈవోపీఆర్డి ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిపిఒ శిరీషారాణి

మలబార్‌లో ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:ప్రముఖ బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా పండుగ ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా విశాఖలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపి అహ్మద్ ఆ వివరాలు వెల్లడించారు. అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాలు తరుగు ఛార్జీలపై 25 శాతం, ప్రీమియం స్టోన్స్ అండ్ అన్‌కట్ డైమండ్ ఆభరణాల తరుగు ఛార్జీలను 25 శాతం తగ్గిస్తున్నామని, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఇస్తున్నామని తెలిపారు. ఈ పండుగ కొనుగోలును వినియోగదారులకు మరింత లాభదాయకంగా మార్చడానికి అడ్వాన్స్ బుకింగ్‌లో ఉచిత వెండి నాణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు తాము కొనుగోలు చేయాలనుకునే బంగారు ఆభరణాలు మొత్తం విలువలో కనీసం 10 శాతం చెల్లించి తమ ఆభరణాలను బుక్ చేసుకోవచ్చని, తద్వారా బంగారం ధరల పెరుగుదల నుండి రక్షణ పొందవచ్చునని ఆయన తెలిపారు. అదే విధంగా బుక్ చేసిన రోజు మార్కెట్ ధర లేదా ఆభరణాలు తీసుకునే రోజు మార్కెట్ ధర ఈ రెండిటిలో ఏది తక్కువైతే దానినే తుది ధరగా నిర్ణయిస్తామని, తద్వారా కస్టమర్లకు సాధ్యమైనంత ఉత్తమ సేవలు అందించేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు. అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ డివైన్ అనే ప్రత్యేక బ్రాండ్ కింద తన్విక అనే కొత్త ఆభరణాల సేకరణను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

సూర్య ఘర్ లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ప్రజాశక్తి -మాడుగుల: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద ప్రతి పంచాయతీలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బంది సీసీలు, సూర్యఘర్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1కేవీ సోలార్ రూట్ టాప్ ఏర్పాటుకు రూ.60వేలు ఖర్చు అవుతుందని దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు రాయితీ అందిస్తుందని డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ.10వేల రుణం పొందవచ్చున్నారు. 2కేవీ, 3కేవీ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీలు ఉన్నాయని, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన వెబ్ సైట్లో స్వయంగా నమోదు చేసుకోవచ్చని, సచివాలయ, వెలుగు సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. ప్రతి పంచాయతీలో వందమంది లబ్ధిదారులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నేత రామకృష్ణ

అర్హులైన వితంతువులకు పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:అర్హులైన వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని వైసిపి నేత వీసం రామకృష్ణ శు క్రవారం ఎంపీడీవో డి సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేయడంతో అర్హులైన వితంతువులకు అన్యాయం జరుగుతుందన్నారు. భర్త మరణిస్తే వెంటనే పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

ముచ్చటగా మూడోసారి..

- నేడు వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వరహానదిపై అసంపూర్తి వంతెన నిర్మాణ పనులకు ఈనెల 26న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేపట్టనున్నారు. దీంతో శంకుస్థాపన పనులు ముచ్చటగా మూడు సార్లు చేసినట్లు అవుతుంది. 2015లో నాటి పంచాయతీరాజ్ గ్రామీణ నీటి సరఫరా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు 6కోట్లతో మొదటిసారి శంకుస్థాపన చేశారు. పిల్లర్ల స్థాయి వరకు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా నిలిచి పోయింది. 2019 లో ఆనాటి వైసిపి ఎమ్మెల్యే గొల్ల బాబురావు రెండోసారి శంకుస్థాపన చేయగా పనులు మాత్రం మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వంలో ముచ్చటగా మూడవసారి 5.75 కోట్లతో శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఈనెల 12న జరగవలసిన శంకుస్థాపన కార్యక్రమం అనివార్య కారణాలతో నిలిచిపోయింది. ఈనెల 26న జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆవిష్కరించనున్న శిలాఫలకం

అవార్డును అందుకుంటున్న సర్పంచ్ వరహాల బాబు

సర్పంచ్‌కు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో న్యాయంపూడి గ్రామ పంచాయతీ సమృద్ధి నీటి సరఫరా విభాగంలో జాతీయ స్థాయిలో ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు విజయవాడలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాల బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం అందుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 11న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయస్థాయి అవార్డు అందుకున్న విషయం తెలిసిందే.

ఉగ్రదాడి బాధితులకు ఎన్ఎస్ఇ రూ.కోటి సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ ఆశిష్ కుమార్‌చౌహాన్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక్కో బాధిత కుటుంబానికి ఎన్ఎస్ఈ తరుపున రూ.4లక్షలు చొప్పున, మొత్తం రూ.కోటి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవనున్నామ న్నారు.

ఉగ్రదాడి హేయం

-పలు చోట్ల ప్రజా సంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు

భీమిలిలో నిర్వహిస్తున్న మానవహారం

చీడికాడలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో కంచరపాలెం పార్టీ కార్యాలయం నుంచి ఊర్వశి జంక్షన్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఉగ్రదాడి హేయమైన చర్యని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఎస్.సోమేశ్వరరావు, ఎస్.శరత్, ఎస్.శ్రావణ్, రవి, అప్పారావు, పి.శారద, ఒ.విజయ, పి.మూర్తి, కె.వెంకటరావు, కె.జనార్దనమ్మ పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో మృతిచెందిన పాండురంగాపురం అపార్టుమెంట్ నివాసి జెఎస్.చంద్రమౌళి భౌతికకాయం వద్ద వార్డు ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి తదితరులు నివాళ్లర్పించారు. చంద్రమౌళి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జవుల్లా ఖాన్, ఎస్ఎస్.మూర్తి, కె.మోహనరావు, జివి.రమణ పాల్గొన్నారు.

గాజువాక : జమ్ముకశ్మీరులో ఉగ్రదాడికి నిరసనగా భెల్ మెయిన్‌గేటు వద్ద సిఐటియు, ఐఎన్‌టియుసి ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేత భూని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిగి, 28 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారని, మృతుల్లో అన్నికులాలు, మతాల వారున్నారన్నారు. దీన్ని రాజకీయాలకతీతంగా ఖండించాలన్నారు..ధర్నాలో సీతన్నాయుడు, ఎన్ జగన్నాథరావు, వి ఆనందరావు, కె నారపరెడ్డి, సిహెచ్ మురలేశ్వరరావు, పి కనకారావు, అల్లు అప్పారావుతో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కరాస: కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో 52వ వార్డు నాగేంద్ర కాలనీలో శుక్రవారం వెలగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి ఐద్వా నాయకురాల సుమిత్ర ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఘన నివాళులర్పించారు.

భీమునిపట్నం : జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండిస్తూ, దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ తగ రఫువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు స్థానిక బీచ్ వద్ద శుక్రవారం ర్యాలీ , మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్, ప్రోగ్రాం అధికారి షరీఫ్, జి.చిన్నయ్య, కిరణ్‌కుమార్, సంగీత మిత్రా పాల్గొన్నారు

గోపాలపట్నం : కాశ్మీర్‌లో ఉగ్రనరమేధానికి నిరసనగా బాజీ జంక్షన్ వద్ద జనసేన ఆధ్వర్యాన శాంతి నిర్వహించారు. జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు, గునిశెట్టి శ్రీనువాసరావు, గొంతిన నాగరాజు, మనోహర్, సురేష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : కశ్మీరు ఉగ్రవాదులకుదీటైన జవాబు చెప్పాలని లయన్స్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్ట్ వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెర్రితలలు వేస్తున్న ఉగ్రవాదాన్ని తుదముట్టించి, ప్రపంచ శాంతికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు..

నర్సీపట్నం చెట్టుపల్లిలో..

నర్సీపట్నం టౌన్: కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడులకు నిరసనగా శుక్రవారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఘటనకు పాల్పడ్డ ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజాల సూరిబాబు, ఊడి చక్రవర్తి, రెల్లి సంఘ నాయకులు యర్రంశెట్టి పాపారావు, కాపు సంఘం అధ్యక్షులు ఇన్నం రమణ, ట్రేడ్ యూనియన్ నాయకులు మోపాడ సత్యప్రసాద్, భవన నిర్మాణ సంఘ అధ్యక్షులు పసుపులేటి అప్పలనాయుడు, కలిమి సత్తిబాబు, చలపతి, కార్మికులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పహల్గాం ఉగ్రవాద దాడులపై యుటిఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం లో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఉగ్రవాద దాడులో మరణించిన కుటుంబాలకు సంతాపం తెలియజేయడం జరిగింది. ఈ దాడులు జరిగినప్పుడు భద్రతా సిబ్బంది లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని వెల్లడించారు. ఆర్టికల్ 370 రద్దు అయితే ఉగ్రవాదం ఆరికడుతుందని చెప్పిన బిజెపి ఈ దాడులకు మతం రంగు పులిముతుందన్నారు. యూటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు పి. గాయిత్రి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, యూటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం.చిట్టియ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా అధ్యక్షులు కె ప్రసన్న, ఐద్వా జిల్లా కొసాదికారి కెవి సూర్యప్రభ, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు విజయ్, కె రామకృష్ణ, యూటీఎఫ్ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోస్...కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న దృశ్యం....

కొత్తకోట: జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చీమలపాడు శివారు అజేయపురం, కల్యాణపు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం క్యాండిల్ తో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. అమాయకమైన ప్రజలను ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అని తెలిపారు. ఇటువంటి చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

చీడికాడ: చీడికాడలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ ఉద్యోగుల సంఘం మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహూర్త శ్రీనివాసరావు, మహజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఘాటీలు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టివాడ స్రామ్రాట్ కుమార్, రావాడ దేవుడు, రావాడ రాము, కడితి రాంబాబు, మాజీ సర్పంచ్ అచ్చియమ్మ పాల్గొన్నారు.

ముస్లిములు నిరసన

గాజువాకలో నివాళి అర్పిస్తున్న ముస్లిములు

గాజువాక : మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాద దాడిని గాజువాక మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విహారయాత్రకు వెళ్లిన పౌరులపై దాడి బాధాకరమని,ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీతమ్మధార : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్ర దాడిని నిరసిస్తూ రామాటాకీస్ దరి యాసిన్ మసీదు వద్ద శుక్రవారం జుమ్మ నమాజ్ అనంతరం ముస్లిములు కన్నీటి నివాళి అర్పిస్తూ, ప్లకార్డులతో నిరసన, ఆందోళన చేపట్టారు. హిందూ, ముస్లిం ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. యాసిన్ మసీదు గౌరవ అధ్యక్షులు ఐ హెచ్ ఫరూఖీ, మాట్లాడుతు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరుగకుండా కేంద్రప్రభుత్వం పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని కోరారు.వైసిపి విశాఖ జిల్లా ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు దేవరకొండ మార్కండేయులు, అలియాస్ మొహమ్మద్ ఇబ్రహీం, విశాఖ జిల్లా ఆల్ మసీద్ అధ్యక్షులు అహ్మదుల్ల ఖాన్, యాసిన్ మసీదు సెక్రటరీ సయ్యద్ మొహమ్మద్‌పాల్గొని అల్లాహ్‌ను ప్రార్థించారు.

కంచరపాలెంలో...

విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విభిన్న ప్రతిభావంతులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దీనిలో భాగంగానే వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఐడిబిఐ బ్యాంకు సామజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా అలింకో సంస్థ తయారుచేసిన రూ.49.01 లక్షల విలువైన 380 అత్యాధునిక ఉపకర ణాలను శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం వేదికగా 241 మంది విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దీనిలో భాగంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల శారీరక, మానసిక దఢత్వం కోసం రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో అత్యాధునిక పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రీజనల్ సెంటర్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సహకారంతో స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన మూడు ప్రత్యేక శిబిరాల్లో వీరి అవసరాలను గుర్తించి, తగిన సహాయక ఉపకరణాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఐడిబిఐ బ్యాంక్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా హైదరాబాద్‌లోని అలింకో సంస్థ అందించిన అత్యుత్తమ నాణ్యత కలిగిన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బ్యాటరీతో నడిచే మోటరైజ్ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు (హియరింగ్ ఎయిడ్స్), సాధారణ ట్రైసైకిళ్లు, వాకింగ్‌స్టిక్స్, కమోడ్‌తో కూడిన సిపి వీల్ చైర్‌లు,టిఎల్ఎం కిట్‌లు, ఫోల్డింగ్ వీల్ చైర్‌లు, కృత్రిమ అవయవాలు (ప్రొస్థెసిస్), జాయ్‌స్టిక్ వీల్ చైర్‌లు, కర్రలు (క్రచెస్), కాలిపర్స్, రోలేటర్,సుగమ్య చెరకు వంటి 380 రకాల ఉపకరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు.ప్రతి ఒక్క లబ్ధిదారుని అవసరాన్ని గుర్తించి, వారికి అవసరమైన ఉపకరణాన్ని అందించడం ప్రభుత్వ నిజమైన సంకల్పానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి కలెక్టర్ హరేంధిరప్రసాద్ దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు,విష్ణు కుమార్ రాజు, ఐడిబిఐ బ్యాంక్ జనరల్ మేనేజర్ కన్వాడేట్ దాస్,విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి మాధ పాల్గొన్నారు.